1. "వీరలను క్షమించు తండ్రి - నేర రేమియున్" = కోరి తిటులు నిన్నుc జంపు - క్రూరజనులకై ॥యాహా॥

2. "నీవు నాతోc బరదైనున - నేcడె యుందువు" = పావనుండ యిట్లుc బలికి - పాపిc గాచితి ॥వాహా॥

3. "అమ్మా! నీ నుతుcడ" టంచు మరి - యమ్మతోc బలికి = క్రమ్మర "నీ జనని" యంచుc - గర్త నుడివితి ॥వాహా॥

4. "నా దేవ దేవ యేమి విడ - నాడితి" వనుచు = శ్రీదేవ సుత పలికితివి శ్రమ - చెప్పశక్యమా ॥యాహా॥

5. "దప్పికొనుచున్నా న" టంచుc - జెప్పితివి గద = యిప్పుగిదిని బాధ నొంద - నేమి నీకు హా! ॥యాహా॥

6. శ్రమ ప్రమాదములను గొప్ప - శబ్ద మెత్తి హా = "సమాప్తమైన" దంచుc దెలిపి - సమసితివి గదా ॥యాహా॥

7. "అప్పగింతుc దండ్రి నీకు - నాత్మ" నంచును = గొప్ప యార్భాటంబు చేసి - కూలిపోతివా ॥యాహా॥

- పంతగాని పరదేశి

## 197 సిలువ ధ్యానము

రా - నాధనామక్రియ తా - ఆది

అయ్యో నాదగు ఘోరపాపము గదా - భారమై నీపై నొరిగె = నెయ్యము వీడి మెస్సీయ్య నిన్ సిలువ - కొయ్యపైని గొరత కప్పగించిన ॥దయ్యో॥

1. నిరతము దూతానీక మూడిగము - నెరపుచుండc దండ్రి పజ్జనుండియు = నిరుపమాన సౌఖ్యములc దేలు నినుc - బరమునుండి క్రిందికి దిగలాగిన ॥దయ్యో॥

2. కోరి నిన్నుc గడుపారc గనియుc గను - లారc చూచుకొన నేరనట్టి యల = మేరి గర్భమున దూయcబడిన కడు - ఘోరమైన ఖడ్గంబు నిజముగ ॥నయ్యో॥



3. మొయ్యరాని పెనుకొయ్య నొందు నీ - మూపుపైన భారముగ మోపి = రయ్యయ్యో యింత బాధ సల్పినది యూ - దయ్య వాసులెంత మాత్రమునుగా ॥రయ్యో॥

4. కోలలచే నెన్నెన్నొ పెట్లు పెను - గోలగాక యెన్నెన్నొ తిట్లు కృప = మాలి నీదు వదనమ్ముపై నుమియ -నేల నింత కోపంబురాదు నిజ ॥మయ్యో॥

5. ముండ్లతోడ మకుట మొక్క టల్లి కడు - మూర్ఖత నీ తలపైనిc బెట్టి నీ = కండ్ల కొక్క గంతc గడ - గండు పెట్టc గారణము నిజముగా ॥నయ్యో॥

6. ఈవు ప్రాణమును నీవిగ నొసcగ - నీటెతోడc బ్రక్కను బొడుచుట హా = భావమందుc దలపోసి చూడ నల - బంటు గాదు బల్లెంబు గాదు నిజ ॥మయ్యో॥

- యెద్దు దానియేలు

## 198 సిలువ బలము

రా - కురంజి తా - ఆది

సిలువే నా శరణాయెను రా - నీ - సిలువే నా శర ణాయెను రా = సిలువ యందే ముక్తి బలముc - జూచితి రా ॥నీ సిలువే॥

1. సిలువను వ్రాలి యేసు - పలికిన పలుకు లందు = విలువలేని ప్రేమామృతముc గ్రోలితి రా ॥నీ సిలువే॥

2. సిలువను జూచుకొలcది - శిలసమానమైన మనసు = నలిగి కరిగి నీరగు చున్నది రా ॥నీ సిలువే॥

3. సిలువను దరచి తరచితి - విలువ కందcగ రాని నీ కృప = కలుష మెల్లను బాపcగc జాలును రా ॥నీ సిలువే॥

4. పలు విధ పథము లరసి - ఫలిత మేమి గానలేక = సిలువయెదుటను నిలచినాcడను రా ॥నీ సిలువే॥

5. శరణు యేసు శరణు శరణు - శరణు శరణు నా ప్రభువా = దురిత దూరుcడ నీ దరిc జేరితి రా ॥నీ సిలువే॥

- చెట్టి భానుమూర్తి